ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు


సోమవారం 14 ఏప్రిల్ 2025

'ఉపాధి' కష్టాలు

- కూలీలకు సకాలంలో అందని వేతనాలు
- పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- ఎండలతో అవస్థలు.. పట్టించుకోని అధికారులు



కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు కష్టాలు తప్పడం లేదు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు చేసి పనులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పేదలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించి ఈ బిల్లును తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో పలు పనులు చేయించి తద్వారా అభివృద్ధితో పాటు, కూలీలకు ఉపాధి దొరికి వలసలు పోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను ప్రవేశ పెట్టింది. కానీ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సరైన పనులు దొరకడం లేదు. ఉపాధి హామీ డబ్బులు కూడా కొన్ని చోట్ల నెలల తరబడి రాకపోవడంతో కూలీలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వేసవి కాలంలో కూలీలు పని చేసే టప్పుడు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేసే సౌకర్యాలు కూడా లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలు ఏటా వడదెబ్బ, తదితర అనారోగ్యానికి గురవుతున్నారు. అలాగే కూలీలకు ఇవాల్సిన ఆత్మీయ భరోసా ఆర్థిక సాయం అందడం లేదు. సిబ్బంది తీసే మట్టి పనుల కొలతల్లో తేడాలు రావడంతో కూలీలు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇటీవల ఉపాధి హామీ పని వేతనం కేవలం ఏడు రూపాయలు మాత్రమే పెంచారు. నిత్యావసరాలధరలు మాత్రం ఆకాశాన్నంటుతుండడం తదను గుణంగా రూ. 600 వరకు కూలీ ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 300 మాత్రమే చూపిస్తున్నారు. ఈ కూలీలో కేవలం కూలీ రూ. 150 వరకే గిట్టుబాటు అవుతుండడం పని గంటలు పెరగడం కష్టంగా మారింది. కూలీ రేట్లు పెంచి పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచి నీరు, ఆటోఛార్జీలు, పని ప్రదేశంలో టెంటు తదితర సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కూలీల ఇందిని దృష్టిలో పెట్టుకొని పోటో యాప్ సిస్టం తొలగించాలని డిమాండ్ చేస్తు న్నారు. 2025-56 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 56 కోట్లు సిమెంటు పనులను మంజూరు చేసి పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించారు. వీటితో పాటు 132.99 కోట్ల మట్టి పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు.

15 మండలాల పరిధిలో..

జిల్లావ్యాప్తంగా ఉన్న 15 మండలాల పరిధిలో మొత్తం 1,23, 035 జాబ్ కార్డులు ఉన్నా యి. ఈ పరిధిలో 2,43,969 కూలీలు న్నారు. వీటిలో కేవలం 91,721 జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. కేవలం సగానికి సగం జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉండడం వీటిలో 1,70,268 మంది కూలీలు మాత్రమే పనులు చేయిస్తుండడం అనుమానాలకు తావిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల పనులు కొనసాగుతు న్నాయి. కోట్లాది రూపా యలతో ఉపాధి హామీ కూలీ లతో చేప డుతున్న పనులు ఇష్టారాజ్యంగా పనులు జరుగుతున్నాయని ఆరోపణలు న్నాయి. ఎంజిఎన్‌ఆర్ ఈజీఎస్ పనుల్లో ప్రతీ సారి జరిగే సామాజిక తనిఖీలో బహిర్గతం అయ్యే అవకతవలే ఇందుకు నిదర్శనం. కూలీలందరికీ పనులు కల్పించి వ్యవసా య, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయాలని ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం పనుల్లో సీసీ రోడ్లు, కాలువలు, ఇతర పనులకు కోట్లాది రూపాయలు విడుదల చేసి పనులు చేపడతుండడంతో ఆయా పనుల్లో అవినీతి, అక్రమాలకు తెరలేపినట్లు కార్మిక సంఘాల నాయ కులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు మట్టి పనులు చేపట్టే కూలీలకు శ్రమ దోపిడీ, మరో వైపు సిమెం టు రోడ్లు, మురికి కాలువలు, ఇతర పనుల్లో మాత్రం అంతులేని అవినీతి రాజ్యమేలు తోందని చెబుతున్నారు. ఇప్పటికై నా అధికారులు పని ప్రదేశాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. వేత నాలు సకాలంలో అందజేస్తే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..

జిల్లాలో ప్రస్తుతం 42 డీగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేసవి కాలంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాంటేనే గ్రామీణులు జంకుతున్నారు. దీనికి తోడు అసౌకర్యాల మధ్యే పనుల చేయించడం, ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడంలో తదితర సమస్యలతో అధికారులు ఒత్తిడి చేస్తు న్నారనే ఆరోపణలున్నాయి. మొబైల్ ఫోన్ల సిగ్నల్స్ రాక ఫొటోలు అప్‌లోడ్ చేయడంతో తీవ్ర ఇబ్బం దులు ఎదురవుతున్నాయని కూలీలు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జాతీయ ఉపాధిహామీ పథకం కింద రైతుల పొలాల్లో కుంటలు, గట్లు, చెరువుల్లో పూడికతీత, పొలాల్లో మట్టి రోడ్ల నిర్మాణం, ఇతర మట్టి పనులు చేపడు తుంటారు. ఇటీవల గ్రామాల్లో సైతం రోడ్లు, మురికి కాలువలు, భవన నిర్మాణ సిమెంటు పనులు కొనసాగిస్తున్నారు. కోట్లాది రూపాయలతో ఈ పనులు కొనసాగుతు న్నాయి. కానీ మట్టి పని చేపట్టే కూలీలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎర్రటి ఎండలో రోజూ 12 గంటల పాటు పని చేస్తున్నా కూలీలనుపట్టించుకోవడం లేదు. పైగా వారికి పని ప్రదేశంలో అందించాల్సిన తట్టలు, పారలు, గడ్డపారలు, ఇతర పని ముట్ల సమకూర్చడం లేదని ఉన్నతాధి కారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

కూలీల ఇబ్బందులపై పట్టింపు లేదు..

-ముంజం ఆనంద్‌కుమార్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనర్



ఉపాధి హామీ పథకం కూలీల ఇబ్బందులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం నామమాత్రపు కూలీ రేట్లు అందించి శ్రమ దోపిడీ చేస్తున్నారు. కనీస వసతులు కల్పించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎండ తీవ్రతగా ఉపాధి కూలీలు అల్లాడుతున్నారు. వడదెబ్బతో ఇబ్బంది జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి. 12 గంటలు శ్రమించినా రూ. 150 నుంచి 200 వరకే కూలి డబ్బులు వస్తున్నాయి. నిబంధనల మేరకు కూలి అందేలా చర్యలు తీసుకోవాలి.

జనసంద్రం

- మహంకాళీ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తుల రాక



అమ్మవారిని దర్శించుకున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఇందిరనగర్‌లోని మహంకాళీ జాతర రెండో రోజు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు, కోవ సాయి దంపతులు అమ్మవారి వద్ద పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మొక్కులు తీర్చుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు.అలయ అర్చకులు దేవర వినోద్ స్వామి, ఆలయ అధ్యక్షుడు మోడం తిరుపతి గౌడ్ ఆలయానికి వచ్చిన నాయకులను సన్మానించారు. భక్తులకు అన్నదానం చేశారు.



జాతరలో భక్తుల సందడి

ఈదురుగాలులు.. వర్షం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి తీవ్రతకు పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి. కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమి అధికంగా ఉండడంతో సాయంత్రం కురిసిన అకాల వర్షం కాస్త ఊరటనిచ్చింది. మార్కెట్‌లో నిర్మిస్తున్న భవనం తాలుకా గోడ గాలి తీవ్రతకు కూలి పోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

యువత ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): యువతతో పాటు ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ అహిర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశాల్ ఏర్పాటు చేసిన జిమ్‌ను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, వన్‌నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యం కోసం జిమ్ తప్పని సరిగా చేయాలన్నారు. వ్యాయమంతో ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున్, రమేష్, ప్రశాంత్, మారుతి, శంకర్, తరుణ్, గణేష్, సతీష్‌బాబు, ప్రసాద్, రవీందర్ తదితరుల పాల్గొన్నారు కాగా ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర ఓబీసీ చైర్మన్ హంసరాజ్ అహిర్‌ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేశారు. బీసీ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు.

దరఖాస్తుల స్వీకరణ

సిర్పూర్(టి), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 14 వరకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొనడంతో ఆదివారం మండల కేంద్రంలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం గడువు ముగుస్తున్నందున దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాయలంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను సెలువు రోజుల్లో స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. శనివారం 35, ఆదివారం 26 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. న్‌లైన్‌లో లేదా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులు స్వీకరించడానికి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అల్బర్ట్ తెలిపారు. నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

సిర్పూర్(యు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏఎస్పీ చిత్తరంజన్ ఆయన ఆదివాసీ నాయకులతో కలిసి ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తుందన్నారు. పోలీసులు అంటే ఎలాంటి భయం పెట్టుకోవద్దని సూచించారు. నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జైనూరు సీఐ రమేశ్, సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఆత్రం భగ్వంత్‌రావ్, నాయకులు భీంరావ్, భుజంగ్‌రావ్ పాల్గొన్నారు.

ఉగ్రభానుడు

- జిల్లాలో వడగాలుల తీవ్రత
- 43.4 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గు మంటున్నాడు. ఉదయం తొమ్మిదిటి నుంచే సూరీడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం నేలపై నిప్పుల వాన కురిసినట్లుగా ఉంటుంది. రహదారులనీ జన సంచారం లేక బోసిపోతున్నాయి. సాయంత్రం వరకు అగ్ని గోళాన్ని తలపిస్తోంది. ఐదు రోజులుగా ప్రచండ భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతకు తోడు ఉక్క పోత, వడగాలులతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. బయట అడుగు పెట్టాలంటేనే జంకుతున్నారు. అంతే కాకుండా ఉష్ణోగ్రతకు వన్యప్రాణులు అల్లాడి పోతున్నాయి. ఐదు రోజులుగా జిల్లాలో 43.4 నుంచి 43.7 డిగ్రీల సెల్సియస్‌తో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, డీ హైడ్రేషన్‌కు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మరో కొన్ని రోజులు ఇలాగే ఉంటుందని అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా...

మండలం	కనిష్ఠం	గరిష్ఠం
దహెగం	25.5	43.4
రెబ్బెన	23.4	43.2
బెజ్జూరు	24.6	43.1
పెంచికలపేట	26.4	43.1
కాగజ్‌నగర్	24.6	43.0
కౌటాల	26.2	42.9
సిర్పూర్(టి)	25.0	42.9
తిర్యాణి	21.9	42.7
ఆసిఫాబాద్	23.0	42.7
కెరమెరి	22.3	42.6
చింతలమానేపల్లి	24.3	42.1
వాంకిడి	23.4	41.4



ఆసిఫాబాద్‌లో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు..

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నాలుగు రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. ఆదివారం 43.4 డిగ్రీలకు వరకు చేరుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 దాక ఎండ ప్రతాపం చూపుతున్నది. రాత్రి 8 గంటలు దాకా వడగాలుల ప్రభావం ఉంటోంది. అర్ధరాత్రి వరకు వేడి గాలులు కొనసాగుతున్నాయి. వేడిగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇంట్లో ఉన్న సామగ్రి సైతం ఎండ వేడికి భగ్గుమంటోంది. భానుడు ఉగ్ర రూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు.

నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు..

వాహనదారులతో రద్దీగా ఉండే రోడ్లన్నీ ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం రోడ్లపైకి రావాలంటే వాహనదారులు వెనకంజ వేస్తున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండవేళల్లో బయట తిరుగకూడదని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ లక్షణాలు ఇలా ఉంటాయని చెబుతున్నారు.



కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



వాంకిడిలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు జైబాపు, జైభీం, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టడానికి ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, జీవన్, గణేష్, దాదాజీ, ప్రశాంత్, సుధాకర్, అనిల్, గుండయ్య, ప్రశాంత్, తదతరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

వాంకిడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో సిద్ధార్థ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు బ్లడ్ బ్యాంకులో అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉండేందుకు రక్తదాన శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఒకరు రక్త దానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలన్నారు. రక్త దానం చేయడం ద్వారా దాతల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు. యువతలో మానవతా విలువలు పెరుగుతాయన్నారు. యువకులు సమాజసేవ కార్యక్రమాలతో పాటు ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలన్నారు. రక్త దానం చేసిన యువతను, రక్తదాన శిబిరం నిర్వహించిన సిద్ధార్థ యుజవజన సంఘ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం రక్త దానం చేసిన యువకులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు మహోల్కార్ అశోక్, అంబెడ్కర్ యువజన సంఘం నాయకులు జైరాం ఉప్రె, హంసరాజ్, విలాస్, రాజేంద్రప్రసాద్, దుర్గం ప్రశాంత్, విజయ్, దుర్గం సందీప్, ప్రతాప్, దుర్గం శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనా లకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనీల్‌గౌడ్ అన్నారు. కేబీ చౌక్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యువత ఆటల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, నా యకులు సాగర్, వెంక టేశంగౌడ్, వినోద్, శంక ర్, విజయ్, చిన్నయ్య, రాజేష్, రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా

నీటి సరఫరా

● అభిలాష్, మిషన్ భగీరథ ఏఈ అభిలాష్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో భగీరథ ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందుతుందా?

ఏఈ : గ్రామాల్లో ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందజేస్తున్నాం. ప్రజలు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : పైపు లైన్ లీకేజీ కారణం గా కొన్ని చోట్ల నీరు వృధాగా పోతుంది కదా దీని కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఏఈ : గ్రామాల్లో లీకేజీ పైపులైన్లను గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నాం. కొన్నిచోట్ల ఆలస్యమైనా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : కొన్ని చోట్ల భగీరథ నీరు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

ఏఈ : అన్ని గ్రామాల్లోకు పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేస్తున్నాం. కొన్ని చోట్ల మాత్రమే మరమ్మతుల సమయంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నాం. పనులు పూర్తి కాగానే నీటి సరఫరా కొనసాగిస్తున్నాం.

- బెజ్జూరు, ఆంధ్రజ్యోతి


తీరని కష్టం.. అనుమతుల్లో జాప్యం



మార్గ మధ్యలో కొట్టుకు పోయిన కల్వర్టు

- ఏడేళ్లుగా పూర్తి కాని రోడ్డు పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- వర్షాకాలంలో రాకపోకలకు గిరిజనుల అవస్థలు

సిర్పూర్(టి), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అటవీ అనుమతులు రావడంలో జాప్యంతో ఏళ్ల తరబడి రోడ్డు పనులు నిలిచిపోయి గిరిజనులు అవస్థలు పడుతు న్నారు. ఇక వర్షాకాలంలో వరదలకు వాగులు, ఒర్రెలు నిండుగా ప్రవహిస్తే రోజుల తరబడి ఆయా గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతు న్నాయి. ఆ సమయంలో ఎవరైన అనారోగ్యం బారిన పడినా సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పో తున్న దుస్థితి నెలకొంది.



నిలిచిపోయిన చీలపల్లి రోడ్డు

● రూ. రూ.18 లక్షలతో..

సిర్పూర్(టి) మండల కేంద్రంలోని మారు మూల గిరిజన ప్రాంతాలైన చీలపల్లి, మేట్‌పల్లి, లింబుగూడ గ్రామాలకు 2018లో రూ.18 లక్షలతో ప్రధానమంత్రి సడక్‌యోజన పథకం కింద రోడ్డు మంజూరు చేసింది. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు లాంచనంగా ఈ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

సదరు కాంట్రాక్టర్ సైతం పనులు ప్రారంభించి కొంత మేరకు పూర్తి చేశారు. ప్రధాన అటవీ ప్రాంతంలో పనులు చేపడు తుండగా ఆ సమయంలో అటవీ శాఖాధికారులు మ్యాప్ ద్వారా ఈ స్థలం పూర్తిగా రిజర్వు ఫారెస్టులోకి వస్తుందని తెలిపారు. పనులకు ఎన్‌ఓసీ క్లియరెన్స్ వచ్చే వరకు చేయకూడదని అడ్డు చెప్పారు. సదరు కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో ఏడేళ్లుగా ఈ రోడ్డు పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉంది అన్న చందంగా మారింది. ఇప్పటివరకు అధికారులు, నాయకులు పట్టించుకోక పోవడంతో గ్రామస్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో వైద్యం నిమిత్తం 108, 102 అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గర్భిణులు సిర్పూర్(టి), కాగజ్‌నగర్ ప్రాంతాలకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదలకు వాగులు ఉప్పొంగి సమయంలో సకాలంలో వైద్యం అందక పలువురు మృత్యువాత పడిన సంఘట నలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



2018లో ఏర్పాటు చేసిన శిలాఫలకం

అటవీశాఖ క్లియరెన్స్ వస్తే పూర్తి చేస్తాం..

అటవీశాఖ క్లియరెన్స్ వస్తే పనులు పూర్తి చేస్తాం. సిర్పూర్(టి) నుంచి చీలపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు మార్గ మధ్యలో నిలిచి పోయా యి. అటవీ శాఖాధికారుల నుంచి ఎన్‌ఓసీ వస్తే చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

నెన్నెల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖైలారం గ్రామానికి చెందిన ధర్మరాజుల శ్రీనివాస్ (44) అనే వ్యక్తి ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. తన ఇంట్లోని డెక్ రిపేరుకు రాగా దాన్ని సవరించే క్రమంలో శ్రీనివాస్ విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్‌ను కర్ర సాయంతో పక్కకు జరిపారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

మందమర్రిటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జాతీయ రహదారి ఇల్లందు గెస్ట్‌హౌజ్ ఎదురుగా ఉన్న రోడ్డుపై కారు ఢీకొన్న సంఘటనలో జీఎం కార్యాలయం ఏరియాకు చెందిన మహంకాళి భూదేవి (65) అక్కడికక్కడే మృతిచెందింది. సరుకులు కొనేందుకు కిరాణం దుకాణానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా అతి వేగంగా బెల్లంపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలై మృతిచెందింది. సంఘటన స్థలానికి ఎస్‌ఐ రాజశేఖర్ చేరుకుని వివరాలను సేకరించారు. భూదేవి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలుకు కూతురు, కుమారుడు ఉన్నారు.

అదనపు వరకట్నం వేధింపులకు వివాహిత బలి

ఇంట్లో ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



వరలక్ష్మి(ఫైల్)

దండేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం అత్తింటి వారి వేధింపులను తట్టుకోలేక ఓ మహిళ ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనమండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. దండేపల్లి గ్రామానికి చెందిన గంగాధరి వరలక్ష్మి(38) అనే వివాహిత ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. దండేపల్లికి చెందిన గంగాధరి మల్లేష్‌కు జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంత్ రావుపేట గ్రామానికి చెందిన దీటి రాజమల్లు కూతురు వరలక్ష్మి(మేఘన)కి 2017లో వివాహం జరిగింది.. పెళ్లి సమయంలో కట్నం కింద రూ. 4లక్షలు, నాలుగు తులాల బంగా రం, మిగతా లాంచనాలు ముట్టజెప్పారు. దంపతులకు ఆరేళ్ల కుమారుడు ఆరు నెలల కూతురు ఉంది. పలుమారు దంపతుల మధ్య అదనపు కట్నం కోసం తగాదాలు జరిగాయి. భర్తతో పాటు అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తున్నారని ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఏడాది క్రితం పెద్దల సమక్ష్యంలో పంచాయతీ కూడా పెట్టారు. సరిగ్గా చూసుకుంటామని పెద్దల సమక్ష్యంలో భర్త చెప్పడంతో భార్య వరలక్ష్మిని ఇంటికి తీసుకువచ్చారు. అయి నా వారి సూటిపోటి మాటలతో వేధింపులకు గురి చేయడంతో ఆమె తీవ్ర మనస్థాపం చెంది 10రోజుల క్రితం తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. వారు ప్రసుత్తం మహారాష్ట్రలో భీవండిలో ఉంటు న్నారు. ఆమెకి ఫోన్‌లో సర్దిచెప్పి వచ్చాక ఇంటికి తీసుకెళ్తానని చెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లికి ఏమైందో కూడా తెలుసుకునే వయసు కాని ఆ చిన్నారుల బిత్తర చూపులు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. తండ్రి రాజమల్లు ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నాని ఎస్సై తహసీనోద్దీన్ వెల్లడించారు.

పొలంలో విద్యుత్ ఫెన్సింగ్‌కు తగిలి కుమారుడి మృతి

● కేసు భయంతో మృతదేహాన్ని పెన్‌గంగలో పడేసిన తండ్రి ● అతడితో పాటు సహకరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

సిర్పూరు(టి), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పొలం చుట్టూ వేసి విద్యుత్ కంచెకు తగిలి కుమారుడు మృతి చెందాడు. తప్పు తన మీదకు వస్తుందేమోనని మృతదేహాన్ని తండ్రి మరో వ్యక్తి సాయంతో పెన్‌గంగలో పడేశాడు. కుమరం భీం జిల్లా కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆదివారం సిర్పూరు(టి) పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సిర్పూరు(టి) మండలం టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయందర్(19) ఈ నెల 9న తప్పిపోయినట్లు మరుసటి రోజు తండ్రి చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం పెన్‌గంగలో యువకుడి శవం ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. తప్పిపోయినట్లు ఫిర్యాదు చేసినా జయందర్‌గా గుర్తించారు. మృతదేహంపై విద్యుత్ తీగల గుర్తులు ఉండడంతో తండ్రి చిరంజీవిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చిరంజీవి తాము చేసి నేరాన్ని అంగీకరించాడు. ఈ నెల 9న చిరంజీవి అడవిపందుల బారి నుంచి పంటను రక్షించే క్రమంలో పొలానికి ఉన్న కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. అదే రాత్రి వర్షం వస్తోందని, ఎండు మిర్చి కొట్టుకు పోతుందని జయందర్ పొలానికి వెళ్లాడు. పొలం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తాకి అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు ఇంటికి రాక పోవడంతో తండ్రి చౌదరి చిరంజీవి పొలానికి వెళ్లి చూడగా జయందర్ మృతి చెంది ఉన్నాడు. తనపై కేసు అవుతుందనే భయంతో పక్క చేను రైతు చెలిరామ్‌తో కలిసి మృతదేహాన్ని అదే రాత్రి బైక్‌పై తీసుకెళ్లి సిద్ధిహనుమాన్ సమీపంలోని పెన్‌గంగలో పడేసినట్లు తండ్రి ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. శనివారం శవం పెన్‌గంగలో కన్పించడంతో పోస్టుమార్టం నిర్వహించి ఫోరెన్సిక్ ల్యాబోరెటరికి పంపించామని చెప్పారు. యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు రిపోర్టులో తేలిందన్నారు. ఈ మేరకు తండ్రి చిరంజీవితో పాటు అతడికి సహకరించిన చెలిరామ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై కమలాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ముత్యం రమేశ్

కార్మికులకు మెరుగైన వైద్యం ఏదీ?

- అరకొర సిబ్బందితో అవస్థలు



బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి

బెల్లంపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు, కార్మిక కుటుంబాలకు మె రుగైన వైద్యసేవలందించాల్సిన సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఆసుపత్రికి వెళ్లి వైద్యసేవలకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో కార్మికులు వారి కుటుంబాలు ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో గత కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో వైద్యులులేక కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదు. ఎవరైన అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళితే దూర ప్రాంతంలోఉన్న ఇతర ఏరియాల ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. మెరుగైన వైద్యసేవలందడం లేదని కార్మిక సంఘాలు, కార్మికులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ సింగరేణి యాజమాన్యం, ప్రజాప్రతినిధులు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెరుగైన సేవల కోసం..

పట్టణంలో కార్మికులకు, కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం కోసం సింగరేణి యాజమాన్యం 1987 ఏరియా ఆసుపత్రిని నిర్మించింది. విశాలమైన స్థలంలో అన్ని వసతులతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. మూడు వేలకు పైగా కార్మికులు, వారి కుటుంబాలు మరో మూడు వేల మందికిపైగా రిటైర్డ్ కార్మికులు బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యసేవలపై ఆధారపడు తున్నారు. 275 పడకలతో సింగరేణి యాజమాన్యం ఆసుపత్రిని ప్రారంభించింది. కానీ ప్రస్తుతం 50 పడకలకే పరిమితమైంది. ఈ ఆసుపత్రిలో గతంలో మహిళలకు, పురుషులకు ప్రత్యేక వార్డులు ఉండేవి. ప్రస్తుతం అన్ని సేవలు ఒకే వార్డు పరిధిలోకి తీసుకొచ్చారు. కాగా ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయక పోవడంతో మెరుగైన సేవలు అందడం లేదు. ఏడుగురు స్పెషలిస్టు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టాఫ్ నర్సుల పోస్టులు, మేల్, ఫిమేల్, స్కావెంజలర్లు, ఫార్మాసిస్టుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆసుపత్రిలో 300 మందికి పైగా ఓపీ ఉంటుంది. అలాగే ల్యాబ్‌టెక్నీషియన్లు, ఎక్స్‌రే టెక్నీషియన్లు పోస్టులు కూడ ఖాళీగా ఉన్నాయి. అలాగే మెరుగైన వైద్యసేవల కోసం పరికరాలు అందుబాటులో లేవు. గతంలో ఏరియా ఆసుపత్రిలో ఆర్థో, టీబీ, బ్లడ్‌బ్యాంక్ వంటి సేవలు అందేవి ప్రస్తుతం ఈ సేవలు ఆసుపత్రిలో నిలిచిపోయాయి.

రేపు సీనియర్ ఉమెన్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో మంగళవారం సీనియర్ ఉమెన్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుం దర్‌రావు, ప్రధాన కార్యదరి ్శరమేశ్, కోశాధికారి రమేశ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థినికి అభినందన

ఆసిఫాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లోని టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల పాఠశాలకు చెందిన సీహెచ్ అక్షర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో ఆదివారం పలువురు అభినందించారు. అక్షర ఈ నెల 14 నుంచి 21 వరకు మణిపూర్‌లోని ఇంపాల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపాల్ అనిత, కోచ్ రవికుమార్, పీడీ భవిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



జెండా ఎగురవేస్తున్న టీఎస్‌టీయూటీఎఫ్ నాయకులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి శాంతికుమారి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) 12వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, జిల్లా కార్యదర్శి ఎం రాజకమలాకరెడ్డి మాట్లాడారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో పని చేస్తున్న ఉపాధ్యాయ సంఘం టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. హక్కులు, బాధ్యతలు, ఉద్యమ నేత్రాలు, ప్రాంతాలు, కులాల అంతరాలను అధిగమించి ఒకే సంఘం అనే చారిత్రక ఆవశ్యతతో ఆవిర్భవించింది టీఎస్‌యూటీఎఫ్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘ జెండాను టీఎస్‌టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రీతి, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సాయికుమార్, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు బాజీఖాన్, శిరీష, సురేష్, జహీర్, విజయ్, రాజశేఖర్, ప్రవళిక, రష్మిక, శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఆదిత్య అపార్టమెంట్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుల్గచ్ దేవాన్ష్(10) అనే ఐదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ వినీత తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన దేవాన్ష్ అతని స్నేహితులు సాయిసిద్దార్థ్ శ్రేయాన్స్ కలిసి పాత మంచిర్యాల నుంచి మంచిర్యాలకు వస్తున్నారు. ఇదే క్రమంలో హైలైఫ్ నుంచి మంచిర్యాల వైపు వేగంగా వస్తున్న టీఎస్11జీ1703 టాటా డియాగో కారు వీరి వాహనాన్ని ఢీ కొనడంతో ముగ్గిరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే దేవాన్ష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయిసిద్దార్థ్, శ్రేయాన్స్‌కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి దీపక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినీత తెలిపారు.

బొగ్గు నిల్వలకు ఆటంకం కలుగొద్దు



ఇందారం ఓసీపీని సందర్శిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

జైపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సంప్ ఏరియాలో బొగ్గు నిల్వలకు ఆటంకం కలుగకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కె వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఇందారం ఓసీపీ గనిని ఆదివారం సందర్శించారు. ఓసీపీ క్వారీలోని వ్యూ పాయింట్ నుంచి పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేయాలని , ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులందరు రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలన్నారు. ఉత్పత్తి సాధించే క్రమంలో ప్రతి ఉద్యోగి, అధికారి రక్షణను మర్చిపోవద్దని సూచించారు. వరాహా కాంట్రాక్టర్ తీయాల్సిన రోజు వారి ఓబీ ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలన్నారు. ఓబీ ఎంత ఎక్కువ తీస్తే బొగ్గు అంత ఎక్కువ ఉత్పత్తి జరిగి రవాణా చేయవచ్చని చెప్పారు. వరాహా కంపెనీ యంత్రాల పని గంటలను పెంచాలని, రోజువారి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడానికి యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని కంపెనీ ప్రతినిదులకు సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓసీపీ గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, రక్షణాధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉత్పత్తి అయిన బొగ్గును వినియోగదారులకు త్వరగా అందించాలని డైరెక్టర్(ప్రాజెక్ట్స్, ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఓసీపీ, సీహెచ్‌పీని జీఎం ఎం శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఉత్పత్తి, ఉత్పాదకత గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, నిలువ ఉన్న బొగ్గును సైతం రవాణా చేయాలన్నారు. ఉపరితల గనులకు అవసరమైన యంత్రాలు, యంత్రపరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాలను నిర్ధేశిం చుకొని వాటి ని చేరేందుకు ప్రయత్నించాలన్నారు. రక్షణ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్, ఓబీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కనీస పింఛన్ పెంపుదలకు కృషి చేయాలి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛన్ పెంపుదలకు కృషి చేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో బొగ్గు గనుల శాఖా మంత్రి జి కిషన్ రెడ్డిని ఆదివారం కలిసి 63 పేజీల నివేదికను ఆయనకు అందించారు. అనంతరం మాట్లాడుతూ, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డులో జరిగిన అక్రమాలు, పార్లమెంట్ కమిటీ చేసిన సూచనల అమలు, గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి, పదేళ్లుగా ఢిల్లీ హైకోర్టులో తేలని కేసు, పెన్షన్ పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదికలో వివరించినట్లు పేర్కొన్నారు. విధుల సందర్భంగా ఎన్నో త్యాగాలు చేసి రిటైర్ అయిన తరువాత పింఛన్ తక్కువ వస్తుండడంతో పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో రిటైర్డ్ కార్మికులకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆర్థిక సహకారం అందిస్తున్నారని, అదేమాదిరిగా సింగరేణి విశ్రాంత కార్మికులకు ఇవ్వాలని కోరారు. మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ ఐదేళ్లమారు ఆర్థిక సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీ ఇ చ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి జె.వి. దత్తాత్రేయులు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.సి. రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. బాబురావు, తదితరులు ఉన్నారు.

అటు బెల్లంపల్లి, ఇటు చెన్నూర్ ప్రజల కల నెరవేరడం లేదు. బస్ డిపో ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు బుట్టదాఖలేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బస్ డిపో అయితే తమ కష్టాలు తీరుతాయని ఆశ పడ్డ ప్రజలకు ఆ ఆశ తీరేలా కనిపించడం లేదు.

బస్ డిపో కల నెరవేరేనా..?



- ఎదురుచూస్తున్న బెల్లంపల్లి, చెన్నూర్ ప్రజలు
- అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి బస్సు డిపో ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. దశాబ్దాలుగా ఇక్కడ బస్సు డిపో ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ప్రజానీకం కోరుతున్నా ప్రభుత్వం గాని ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో బరిలో ఉన్న అభ్యర్థులు ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప వాటిని నెరవేర్చడం లేదు. డిపో ఏర్పాటు కాకపోవడంతో సరిపడా బస్సులు లేకపోవడం గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యం కల్పించడంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం విఫలమవుతుండడంతో అధిక శాతం ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.



బెల్లంపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్

దశాబ్దాలుగా ఎదురుచూపులే ...

బెల్లంపల్లి బస్సు డిపో ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దకాలంగా ఉంది. నియోజకవర్గ ప్రజలు బస్సుడిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కల కలగానే మిగిలిపోతోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాలతో 119గ్రామాలు ఉన్నాయి. నిత్యం వేల మంది ప్రయాణికులు మంచి ర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. జిల్లాలో ఒకే ఒక్క బస్సు డిపో జిల్లా కేంద్రంలో ఉంది. బెల్లంపల్లిలో బస్సు ఏర్పాటు కాకపోవడం తో మంచిర్యాలకు వెళ్లి ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్ప డుతోంది. డిపోకోసం దశాబ్దాల క్రితం ఆర్టీసీ బస్టాండ్‌ను ఆనుకొని దాదాపు పది ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి సిద్ధంగా ఉంచారు. సేకరించిన స్థలంలో పెద్దఎత్తున పిచ్చి మొక్కలు మొలిచాయి.

ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం...

గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడి పదేళ్లు అవుతున్నప్పటికీ నేటికి ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. బెల్లంపల్లిలో డిపో లేకపోవడంతో నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులు బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు రావాలంటే ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీ ఇస్తున్నారే తప్ప అమలుకు మాత్రం పూనుకోవడం లేదు.

చెన్నూరులో శంకుస్థాపన చేసి రెండేళ్లు..

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలో ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి ఆది నుంచి అవాంతరాలే ఏర్పడుతున్నాయి. బస్ డిపో నిర్మాణానికి భూమి పూజ చేసి రెండేళ్లు కావస్తున్నా ఆ పనులు ముందుకు సాగడం లేదు. మంచిర్యాల ఆర్టీసీ డిపోకు ఎక్కువగా ఆదాయం తెచ్చిపెట్టే రూట్ చెన్నూరు కావడంతో దీన్ని దృష్టిలో ఉంచుకుని చెన్నూరులో బస్ డిపో ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. చెన్నూరుకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు కాళేశ్వరం పుణ్య క్షేత్రానికి వేలాది మంది ప్రయాణిస్తుంటారు. దీంతో బస్‌డిపో నిర్మాణంపై కొన్నేళ్లుగా డిమాండ్స్ తలెత్తుతున్నాయి. బీజేపీ నాయకులు అయితే చెన్నూరు నుంచి మంచి ర్యాల డిపో వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్, డిపో మేనేజర్‌కు వినతి పత్రాలు సమర్పించారు.

- ఎట్టకేలకు భూమి కేటాయింపు

ప్రజల డిమాండ్ల నేపథ్యంలో నాటి కేసీఆర్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో పట్టణంలోని గెర్రె కాలనీలో సర్వే నెంబరు 869లో 3.1గుంట ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడంతో పాటు డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.4కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో 2023 జులై 30న బస్ డిపో నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బాల్కసుమన్ శంకుస్థాపన చేశారు. పనులు కొనసాగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టూ కాంపౌండ్ వాల్ పనులు పూర్తయ్యాయి. కానీ నిర్మాణ పనులు ఆదిలోనే మిగిలిపోయాయి.

- నెలకొన్న భూ వివాదం..

చెన్నూర్ బస్‌డిపో నిర్మాణం చేపడుతున్న స్థలం తమ పట్టా భూమి అంటూ పట్టణానికి చెందిన కొంత మంది కోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే విధించడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఎలాంటి వివాదంలేని ప్రభుత్వ భూమిని గుర్తించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టాభూమిని గుర్తించడం పైగా దీనిపై కౌంటర్‌దాఖలు చేయ కపోవడంతో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా బస్‌డిపో నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయనే విమర్శలు ఉన్నాయి. కనీ సం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చొరవ తీసుకుని బస్ డిపో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సోమవారం జిల్లా పర్యటనకు వస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు బస్ డిపో నిర్మాణంపై ఈ ప్రాంత ప్రజలు వనతి పత్రం సమర్పించనున్నట్లు తెలిసింది.



అర్ధాంతరంగా నిలిచిన చెన్నూర్ ఆర్టీసీ డిపో పనులు

బస్సు డిపో ఏర్పాటు చేయాలి...



బెల్లంపల్లిలో బస్సుడిపో ఏర్పాటు చేయాలి. ఇక్కడి నుంచి వివిధ పట్టణాలకు, గ్రామాలకు ప్రయాణించేవారి కోసం సమయానికి బస్సులురాక ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల ప్రజలు బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు రావాలన్న పట్టణ ప్రజలు ఇతర పట్టణాలకు వెళ్లాలన్న పూర్తిస్థాయిలో బస్సులు లేకపోవ డంతో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేస్తున్నాం. బస్సు డిపో ఏర్పాటుకోసం ఎన్నో ఎమ్మెల్యేలకు వినతిపత్రాల విన్నవించుకుంటున్నాం.

- కె. శ్రీనివాస్, బెల్లంపల్లి

కౌంటర్ ఫైలు దాఖలు చేశాం..



సర్వే నెంబరు 869లో 3.1 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్టీసీబస్ డిపో నిర్మాణానికి కేటాయిం చాము. కానీ పట్టణానికి చెందిన కొంతమంది ఈ సర్వే నెంబరులోని భూమి పట్టాభూమి అంటూ కోర్టుకు వెళ్లారు. కోర్టు స్టే విధించడంతో డిపో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కోర్టు స్టేపై కౌంటరు ఫైల్ దాఖలు చేశాం.

- మల్లికార్జున్, తహసీల్దార్, చెన్నూర్

నేడు సదస్సు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసు కువస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సోమవారం మందమర్రిలో సదస్సు నిర్వహిస్తున్నామని సీఐటీయూ జాతీయ కార్యదర్శి అల్లి రాజేందర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని, నాలుగు లేబర్ కోడ్‌ను తెస్తుందన్నారు. దీనిపై పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. సదస్సులను మందమర్రిలోని లక్ష్మీ భవానీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు, నాయకులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మట్టల ఆదివారాన్ని పుర స్కరించుకొని పట్టణంలోని క్రైస్తవులు చర్చిల వద్ద ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ జాషువా, క్రైస్తవులు ప్రేమలత, డొలకల డేవిడ్ పాల్గొన్నారు.

గిరిజన రైతు ఇంట్లో సహపంక్తి భోజనం

కాసిపేట, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సన్నబి య్యం పంపిణీ కార్యక్రమంలో ఆదివారం దుబ్బగూడెం గిరిజన రైతు ఇంటిలో సహపంక్తి భోజనం చేశారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం వల్ల ప్రతి పేద కుటుంబంలో ఆనందం వెల్లువిరుస్తుంది. ప్రతి ఒక్కరు మంచి భోజనంతో పాటు ఆరోగ్యంగా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దే

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

నస్పూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్‌ను అడుగడుగనా అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా చేపట్టే సేవ కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌లతో కలిసి మాట్లాడారు. నెహ్రూ నుంచి నేటి రాహుల్ గాంధీ వరకు అంబేద్కర్ ఆశయాలకు, సిద్ధాంతాలకు వ్యతి రేకులన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీం, జై సంవిదాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నిర్వహించడం సిగ్గు చేటన్నారు. బీజేపీ ప్రభుత్వం దళితుడైన రామ్‌నాథ్ కోవింద్, ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్ములను రాష్ట్రపతిని చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ప్రాణహిత-తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేసి తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్నారు. ఇదే విషయంపై తాము సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు దుర్గం అశోక్, కొయ్యల ఏమాజీ, పెద్దపల్లి పురుషోత్తం, అమరాజుల శ్రీదేవి, కోడి రమేష్, గాజుల ముఖేష్ గౌడ్, బియ్యాల సతీష్‌రావు, మున్నారాజా సిసోడియా, సత్రం రమేష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి

దండేపల్లి (లక్షెట్టిపేట), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పంటలకు ప్రభుత్వ మద్దతు ధర కల్పించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. లక్షెట్టిపేట మున్సిపా లిటితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, కాంగ్రెస్ నాయ కులతో కలిసి ఐకేపీ వరిధాన్యం కోను గోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకో కుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండి ఆరీఫ్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, మునిసిపాలిటి మాజీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, డీసీసీ అధికార ప్రతినిధి తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రవి, రాకేష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిరుపతి

ఘనంగా రథోత్సవం

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో రథోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహనచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. అర్చకులు అనిల్‌చారి, అజయ్ చారి, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు దళిత సంఘాలు, కుల సంఘాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి గ్రీన్ పార్కు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని వేడుకలకు ముస్తాబు చేశారు. గనులపై వేడుకలు నిర్వహించడానికి యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. వేడుకలకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి హాజరు కానున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంగా ఏర్పడ్డ 2001-02 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు..



ఒక్కచోట చేరిన 2008-09 బ్యాచ్ విద్యార్థులు

గర్మిళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2001-02 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం బాలుర పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనందంగా గడిపారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన 2008-2009 పదో తరగతి విద్యార్థులు ఆదివారం తమ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

దండేపల్లి/లక్షెట్టిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన అందిస్తుందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటి ఏఐసీసీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని దండేపల్లిలో హనుమాన్ మందిరం నుంచి బస్టాండ్ అంబేద్కర్ విగ్రమం వరకు లక్షెట్టిపేట మున్సిపాలిటిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఆమె మా ట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రజలతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, మాజీ ఎంపీపీలు శకుంతల, కాంతరావు, లక్షెట్టిపేటలో మండల అధ్యక్షుడు రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.



దండేపల్లిలో పాదయాత్ర చేపడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

అభివృద్ధికి బాటలు..

(3వ పేజీ తరువాయి)

వినియోగంతో గ్రీన్ క్రోమిటోరియం నిర్మించారు. ఒకేసారి ఎనిమిది మృతదేహాలను దహనం చేసే విధంగా ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టగా, త్వరలో సోలార్‌తో కూడిన మరో రెండు ఎలక్ట్రికల్ దహన వాటికలను కూడా ఏర్పాటు చేయనున్నారు. దహన సంస్కారాల సమయంలో శివన్నామ స్మరణ కోసం మహా ప్రస్థానం ఆవరణలో 20 ఫీట్ల ఎత్తైన శివ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, చూపరులను అమితంగా ఆకర్షిస్తోంది.

డిప్యూటీ సీఎం టూర్ షెడ్యూల్..

మధ్యాహ్నం 10 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌కు 11 గంటలకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పరిశీలనతో పాటు వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం 1.30 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 2.30 గంటలకు తిరిగి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

బెల్లంపల్లి సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్న సందర్భంలో బెల్లంపల్లిలోని సమస్యలు పరిష్కరించాలని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంసీపీఐయు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లిలో వందపడకల ఆసుపత్రిలో వైద్యులు లేక వైద్య పరికరాలు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించేందుకు కృషి చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయకపోవడంతో పేద మధ్య తరగతి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకొని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు రమేశ్, సతీష్, రాహుల్, ఆకాశ్‌లు పాల్గొన్నారు.

మామిడిచెట్లకు కల్యాణం

బెల్లంపల్లి, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో మామిడితోటలో కాపుకచ్చిన చెట్లకు ఓ రైతు దంపతులు ఆదివారం కల్యాణం జరిపించారు. చంద్రవెల్లి గ్రామానికి చెందిన కొమ్మెర జనార్ధన్ దంపతులు ఐదుఎకరాల మామిడితోటను సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల తరువాత మొదటికాతకు చెట్లు రావడంతో కాతకు వచ్చిన రెండు చెట్లకు దేవతావివాహ పద్ధతిలో అర్చకులు మల్లోజుల రవిశర్మ ఆధ్వర్యంలో వివాహం జరిపించారు. మామిడిచెట్లకు నూత వస్త్రాలను అలంకరించి జిలకర బెల్లం నుంచి మొదలు మాంగళ్యధారణ గావించారు.

సేవా కార్యక్రమంలో ముందుండాలి

బెల్లంపల్లి, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): నేటి యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య ఆదివారం జనహిత అన్నపూర్ణ 4వ వార్షికోత్సవంలో భాగంగా అన్నదాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జనహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు అంబలి పంపిణీ, చలివేంద్రాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షులు సతీష్, సభ్యులు రవి, సంతోష్ బాలాజీ, రాజన్న, పాల్గొన్నారు.

షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ కిరణాలు పథకంలో దరఖాస్తు చేసుకునేవారందరికీ ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్ అన్నారు. యూత్ జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు కొన్నేళ్లుగా నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో విశేషంగా కృషి చేసిన శ్రీరాంపూర్‌కు చెందిన వేముల స్వామిని నస్పూర్ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా, కౌటం కృష్ణను 4వ వార్డు ఇన్‌చార్జిగా నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తలారి రాజు, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, నస్పూర్ మున్సిపాలిటీ అధ్య క్షుడు సారయ్య, పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకంపేట గ్రా మంలో మహిళలు ఖాళీ బిందెలను మధ్యలో ఉంచి బతుకమ్మ ఆడుతూ మంచినీటి కోసం వినూత్నంగా నిరసన తెలిపారు. దుబ్బ గూడెం కాలనీలో నెల రోజుల క్రితం బోరుకు అమర్చిన విద్యుత్ మోటారు కాలిపోయింది. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా ఎవరు పట్టించుకోకపోవడంతో ఆదివారం మహిళలు ఖాళీ బిందెలను మధ్యలో ఉంచి బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకుని తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జన్నారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నేతకాని సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆదివారం ఉట్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. జన్నారానికి చెందిన నేతకాని సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ నేతకాని కులానికి చెందిన జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దుర్గం లక్ష్మీనారాయణకు, ఆదిలాబాద్ ఆర్టీఏ మెంబర్‌గా దూట రాజేశ్వర్‌కు ఎమ్మెల్యే అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

భీమారం, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణములో కాంగ్రెస్ జిల్లా నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ నెల 18న కరీంనగర్‌లోని రేకుర్తి వద్ద కంటి ఆపరేషన్ ఉంటుందని ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకొని జిల్లా పరిషత్ సెకండరి పాఠశాల భీమారం ఆవరణంలో ఉదయం హాజరుకావాలన్నారు. వైద్యులు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బాలమోహన్‌తో పాటు వైద్యులు అభిషేక్, రాకేశ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జన్నారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా ఉండడమే పరిష్కారమని స్థానిక అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణతో కలిసి విడుదల చేశారు. మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ ముజాఫర్ ఆలీఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతాం

మంచిర్యాల క్రైం, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం టీఎస్‌యుటీఎఫ్ పని చేస్తోందని జిల్లా అధ్యక్షుడు గుడారపు చక్రపాణి అన్నారు. ఆదివారం 12వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు, నాయకులు కిరణ్‌కుమార్, చంద్రమౌళి, నర్సయ్య, శ్రీధర్, క్రిష్ణమూర్తి, శంకరయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలవనున్న రేషన్ డీలర్లు

గర్మిళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు సోమవారం వస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వనున్నట్లు జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమీషన్ పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు మహేందర్, అనిల్, తిరుపతి, కిషన్, శ్రీనివాస్, సుధాకర్, మల్లేష్, తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధికి బాటలు

- నేడు డిప్యూటీ సీఎం చేతులమీదుగా ప్రారంభం
- రూ. 250 కోట్లతో కరకట్టల నిర్మాణానికి ముహూర్తం
- రూ. 70 లక్షలతో అంబేద్కర్ విగ్రహావిష్కరణ
- రూ. 400 కోట్లతో పలు పథకాలకు శ్రీకారం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అంబేద్కర్ విగ్రహం

గోదావరి సమీపంలో నిర్మించిన మహాప్రస్థానం



మంచిర్యాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నాంది పల కనున్నారు. నియోజకవర్గంలో కొత్తగా వివిధ పథకాలకు శ్రీకారం చుడుతుండగా, సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, ఇతర మంత్రుల చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టనున్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం మధ్యాహ్నం బహిరంగ సభ ఏర్పాటు చేస్తుండగా, అక్కడి నుంచే డిప్యూటీ సీఎం వర్చువల్‌గా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో అత్యంత ప్రతిష్టాత్మకమైన జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు కరకట్ట నిర్మాణంతోపాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఉన్నాయి. ప్రతిఏటా వర్షాకాలంలో పట్టణాన్ని ముంచెత్తుతున్న రాళ్లవాగు వరదలను నివారించేందుకు వాగుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ (కరకట్ట) నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రూ 250 కోట్లు నిధులు ఇప్పటికే కేటాయించగా, డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయగానే పనులు ఊపందుకోనున్నాయి. గరిష్టంగా సంవత్సర కాలపరిమితితో చేపట్టే పనులకు ఇప్పటికే కాంట్రాక్టింగ్ పూర్తయింది. గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలోని ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం, కాళేశ్వరం వరకు బ్యారేజీల్లో నీటి నిల్వ ప్రభావంతో వర్షాకాలంలో గోదావరి ఉప్పొంగినప్పుడల్లా జిల్లా కేంద్రం వరద ముంపునకు గురవుతోంది. పట్టణం గుండా ప్రవహిస్తున్న రాళ్లవాగులోకి గోదావరి బ్యాక్ వాటర్ రావడంతో కాలనీల్లోకి వరదలు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని అనేక మంది ఇళ్లు నీట మునిగి రూ.కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఎల్లంపల్లి డ్యాం గేట్లు ఎత్తిన ప్రతీసారి అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రాళ్ల వాగువద్ద 7.3 కిలో మీటర్లమేర భారీ కరకట్టల నిర్మాణం చేపట్టనున్నారు. రాళ్లవాగు వరద గోదావరిలో కలిసే చోటు నుంచి ర్యాలీగడ్‌పూర్ వెళ్లే బ్రిడ్జి వరకు గోడల నిర్మాణం చేపట్టనున్నారు. వాగు గోడ ఎత్తు, స్థానికంగా వాగు లోతును బట్టి నిర్మించనున్నారు. ఎత్తుగా ఉన్న చోట కనీసం 5 మీటర్లు ఉంటే, గోదావరిలో కలిసే చోట ఎత్తు 14 మీటర్ల దాకా ఉండనుంది. వాగుకు సమీపంలో ఉన్న ఇళ్లకు ఇబ్బంది లేకుండానే గోడ నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ...

జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో భారీ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయగా, అంబేద్కర్ జయంతిని పురష్కరించుకొని డిప్యూటీ సీఎం ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చైరస్తాలో రూ. 70 లక్షల అంచనా వ్యయంతో గతంలో ఉన్న సర్కిల్‌ను పూర్తిగా తొలగించి, దాని స్థానంలో పార్లమెంట్ భవనాన్ని తలిపించేలా అన్ని హంగులతో గద్దె నిర్మించారు. దానిపై అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సర్కిల్‌లో పూర్తిగా పచ్చదనం నింపనుండటంతో చూపరులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించనున్నారు.

రూ. 11.5 కోట్లతో మహాప్రస్థానం...

జిల్లా కేంద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన హిందూ మహాప్రస్థానం (స్మశానవాటిక)ను రాష్ట్ర మంత్రుల చేతులమీదుగా ప్రారంభించనున్నారు. గోదావరి సమీపంలోని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 11.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మహా ప్రస్థానం నిర్మాణ పనులు గరిష్ఠంగా వంద రోజుల్లోగా పనులు పూర్తికావడం విశేషం. రాష్ట్రంలోనే తొలిసారిగా పూర్తిస్థాయి సౌర విద్యుత్..

(తరువాయి 5 లో)

ఉపముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన, ఇతర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాట్లను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆర్డీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శివాజీలతో కలిసి ఆదివారం పరిశీలించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఉపము ఖ్యమంత్రి పర్యటనకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతరం కాలేజీ రోడ్డులోని మహా ప్రస్థానం పనులను పరిశీలించి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జార్జిరెడ్డి వర్ధంతి

మంచిర్యాలకలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం కామ్రేడ్ జార్జిరెడ్డి 53 వ వర్ధంతిని పీడీఎస్‌యూ నాయకులు ఘనంగా నిర్వహించారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సికిందర్, శశికుమార్, మధు పాల్గొన్నారు.

వాకర్స్ నూతన కమిటీ ఎన్నిక

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాముని చెరువు వాకర్స్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కనుకుంట్ల మల్లయ్య, అధ్యక్షులుగా మొగిలి తిరుపతి, ప్రధాన కార్యదర్శి ముస్కె మల్లేష్, కోశాధికారిగా ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు లచ్చన్న, రాజయ్య, విజయ్‌కుమార్, సుధాకర్, రాజేశం, కైలాసం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- నేటి నుంచి మహాప్రస్థానం అందుబాటులోకి
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు, పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, తదితరులు

మంచిర్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియో జకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐబీ చౌరస్తాలో భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్క రించుకొని చేపట్టనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉప ము ఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే రాళ్లవాగు పక్కన కరకట్ట నిర్మాణానికి శంకు స్థాపనతోపాటు వివిధ పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. విగ్రహావిష్కరణ అనంతరం స్థానికంగా నిర్మాణంలో ఉన్న మాతాశిశు ఆసుపత్రి పనులను మంత్రులు పరిశీలిస్తారన్నారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీప్‌లో వాటర్ ట్యాంక్, జగదాంబ సెంటర్, మెయిన్‌రోడ్, అర్చన చౌరస్తా మీదుగా బాలుర పాఠశాల లో ఏర్పాటు చేసే బహిరంగ సభాస్థలి వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ సభ సందర్భంగా కొత్త పథకాలను కూడా మంత్రులు ప్రకటించే అవకాశాలు ఉన్నాయన్నారు. సభకు 40వేల మంది వరకు ప్రజలు, అభిమానులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో 85 శాతం మంది రైతులకు రు ణమాఫీ జరిగిందని, సన్న బియ్యానికి బోనస్, ఉచిత బస్సు ప్ర యాణం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బియ్యం పంపిణీతో ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేయడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు కోసం బలవంతంగా భూములు లాక్కోవడం లేదని స్పష్టం చేశారు. మహాప్రస్థానం మంగళవారం నుంచి వినియోగంలోకి వస్తుందని, నిరుపేదలకు ఉచితంగా అంత్యక్రియలు చేసుకునేందుకు వెసులుబాటు ఇస్తున్నామని తెలిపారు. తాను చేసే అభివృద్ధి పనులను వక్రీకరిస్తే సహిం చేదిలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షు రాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, మహిళా విభా గం పట్టణాధ్యక్షురాలు గజ్జెల హేమలత, తాజా మాజీ కౌన్సిలర్లు సల్ల మహేష్, రామగిరి భానేష్, పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ విజయ్ సంతాపసభ

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో కామ్రేడ్ విజయ్ సంతాప సభను సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు శ్రీనివాస్, నాయకులు మధు, విజయ్ భార్య మంగ, కూతుర్లు దివ్య, ప్రజ్వల, రాములు, సంకె రవి, రాజన్న, రవీందర్, అరుణ, పాల్గొన్నారు.